సాక్షి
శ్రీకాకుళం
సోమవారం : 25 : డిసెంబర్ : 2023



తక్షణ ప్రవేశాలపై ఆశలు

జీఆర్‌ఏయూలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. 26 నుంచి ప్రక్రియ మొదలుకానుంది.

- 8లో



తగలబెట్టడం తప్పు

పంట వ్యర్థాల కాల్చివేత మితిమీరుతోంది. ఇది పర్యావరణానికి చేటు చేస్తుందని అధికారులంటున్నారు.

- 8లో



గిరి ప్రాంతాల్లో చలిపులి

గిరిజన ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. ఉదయం 9 వరకు మంచ తెర వీడడం లేదు.

- 8లో

న్యూస్‌రీల్

కల్తీ మద్యం కేసులో ఇద్దరు వీఓలు సస్పెండ్

శ్రీకాకుళం క్రైమ్: కల్తీ మద్యం కేసులో ఇద్దరు తనిఖీ అధికారులైన ఎక్సైజ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు ఆదివారం తెలిపారు. ఈ నెల 13న జిల్లాలోని కోటబొమ్మాళి(01991), పిన్నింటిపేట(01182) ప్రభుత్వ మద్యం దుకాణాలను విజిలెన్సు (ఎక్సైజ్) అధికారులు తనిఖీ చేయగా.. కల్తీ మద్యం పట్టుబడింది. దీనిపై సమగ్ర విచారణ కోసం ఓ విచారణ కమిటీని వేశారు. ఇప్పటికే ఆయా దుకాణాల్లో పనిచేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు సేల్స్‌మెన్లను తొలగించడమే కాక కోర్టుకు హాజరుపర్చి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విచారణ అనంతరం ఎక్సైజ్ కానిస్టేబుళ్లు జి.అప్పన్న, బి.మురళిలను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే విధంగా నేరాలు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇకపై బార్లను కూడా తనిఖీ చేస్తామన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీ



సినిమా హాలు సమీపంలోని మద్యం షాపును తనిఖీ చేస్తున్న శ్రీకాకుళం ఎక్సైజ్ ఎస్‌ఐ అప్పారావు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని 1010, 1043, 1044 నంబర్ మద్యం షాపులను శ్రీకాకుళం ఎక్సైజ్ ఎస్‌ఐ బి.అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీ చేశారు. ఇటీవల 1991 షాపులో మద్యం బాటిళ్లలో నీటిని కలిపి విక్రయించడంతో పోలీసులు 1150 బాటిళ్లను సీజ్ చేశారు. ముగ్గురు సేల్స్‌మెన్లను కూడా అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో మిగిలిన షాపులను కూడా తనిఖీ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రదర్శనలో సోంపేట చిన్నారులు



గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రదర్శనలో పాల్గొన్న నటరాజ నాట్యకళామండలి విద్యార్థులు

సోంపేట: సోంపేట పట్టణంలోని శ్రీ నటరాజ నాట్య కళామండలి విద్యార్థులు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రదర్శనలో పాల్గొని ప్రదర్శన ఇచ్చినట్లు నాట్యకళామండలి శిక్షకురాలు ఇద్దె కామేశ్వరి తెలిపారు. ప్రదర్శనలో నాట్యకళామండలి విద్యార్థులు ఇద్దె వాసుదేవ, టి సాత్విక, కె.శ్రీలక్ష్మి, వై.స్వాతి, జె.శృతిహాసిని, దాక్షాయిని, స్నేహ, వి.ఆశ్రిత, జాస్మిత, పి.తాప్సి తదితరులు పాల్గొన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి స్థానికులు అభినందనలు తెలిపారు.

కంటైనర్, ట్రావెల్ బస్సు ఢీ



కంటైనర్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద శనివారం అర్ధరాత్రి ఆగి ఉన్న కంటైనర్‌ను ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి–16 గుండా శ్రీకీర్తన ప్రైవేట్ ట్రావెల్ బస్సు భువనేశ్వర్ నుంచి విశాఖ వైపు అర్ధరాత్రి వస్తోంది. పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో విశాఖకు చెందిన బస్సు డ్రైవర్ మొగల కిరణ్, హెల్పర్ మద్దిల వాసు, బీహార్‌కి చెందిన మరో హెల్పర్ గిరేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేసి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనలో చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వారి వాహనాలు మాత్రం స్వల్పంగా దెబ్బ తిన్నాయి. బస్సులో ప్రయాణికులకు ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పట్టణ హెచ్‌సీ బి.జగదీశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాకుళం టౌన్‌హాలు చర్చిలో బాల ఏసును అలంకరిస్తున్న ఫాదర్ బోనెల రాజు



శ్రీకాకుళం కీస్టోన్ చర్చిలో కేండిల్ లైట్ సర్వీస్

మనసే మందిరం

ఎర్రటి దుస్తులతో శాంటాలు నవ్వుతూ పలకరిస్తున్నాయి. ధగధగలాడుతూ తారలు ఇళ్ల పైకప్పులపై మెరిసిపోతున్నాయి. బృంద గానాలతో క్రీస్తు గీతాలు ఊరంతా వినిపిస్తున్నాయి. కొవ్వొత్తుల వెలుగుల మధ్య పశువుల పాకలు పవిత్రంగా కనిపిస్తున్నాయి. శాంతిదూత ఆగమనం చాటే వేళయ్యింది. కరుణామయుని స్మరణకు భక్తుడి మనసు మందిరం సిద్ధమైంది. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రార్థనా మందిరాలు సుందరంగా ముస్తాబయ్యాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



తెలుగు బాప్టిస్టు చర్చిలో కేండిల్ సర్వీస్



మెళియాపుట్టి: చర్చిలో క్రీస్తు జననం అలంకరణ



క్రైస్తవ ఆరాధన చర్చిలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు, పాస్టర్ జాన్ గోడి



శ్రీకాకుళం కల్చరల్: కీస్టోన్ చర్చిలో లఘునాటిక ప్రదర్శన

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు రేపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం మంగళవారం లెక్కించనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు ఆదివారం తెలిపారు. కార్తీక మాసం అనంతరం స్వామివారి హుండీ లెక్కింపులో ఆసక్తి గల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రం ఆకస్మిక పరిశీలన



కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐజీ హరికృష్ణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రాన్ని విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనకు గ్రీన్ మ్యాట్ పరిచి కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ముందు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో పలు అంశాలపై చర్చించారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం రికార్డులను సైతం తనిఖీ చేశారు. ఆయన వెంట క్రైమ్ అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, కాశీబుగ్గ సీఐ నవీన్‌కుమార్, కాశీబుగ్గ ఎస్‌ఐ ఖాదర్ బాషా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి చర్యలు



సత్కారం అందుకుంటున్న రాష్ట్ర స్థాయి క్రికెటర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ముందడుగు వేస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వైఎస్ శాస్త్రి తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో జిల్లా క్రికెట్ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది కాలం నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి పోటీలు, రంజీ స్థాయి పోటీలకు ఎంపికైన 9మంది క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాస్త్రి, షేక్ హసన్ రాజ తదితరులు మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ క్రీడను ప్రోత్సహించేందుకు త్వరలో ప్రతిష్టాత్మకంగా టోర్నమెంట్‌లను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టి.బాలమురళి, ట్రెజరర్ కెఎస్ఎం స్టాలిన్, కౌన్సిలర్ డాక్టర్ సువ్వారి రవికుమార్, ప్లేయర్స్ ప్రతినిధి ఇలియాస్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణా నేరం

శ్రీకాకుళం క్రైమ్ : నిషేధిత మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేయడం నేరమని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు నగరంలోని పీఎన్‌కాలనీ సమీపంలో నాయుడుచెరువు గట్టు వీధిలో ఆదివారం వేకువజామున మూడు నుంచి ఏడు గంటల వరకు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆధార్‌కార్డును పరిశీలించి కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పరిసరాల్లో దొంగల అలజడి మొదలైందని, బయట గ్రామాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారమిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు పెట్టి గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రివేళల్లో బయట వ్యక్తులు, గుర్తు తెలియని వారు సంచరిస్తే సమాచారమివ్వాలన్నారు. సెర్చ్‌లో భాగంగా 166 ఇళ్లను పరిశీలించి 82 ద్విచక్రవాహనాలను, నాలుగు కార్లను, ఆటోలను తనిఖీ చేసి పత్రాలు లేని ఏడు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు నాగిరెడ్డి లక్ష్మణరావు, కె.లక్ష్మి, ఏఎస్‌ఐలు శంకర్, అరుణ, హెచ్‌సీలు రవి, సింహాచలం(రైటర్), పీసీలు వెంకటేష, రమేష, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వేకువజామున మూడు గంటలకు కార్డన్ సెర్చ్‌కు సన్నద్ధమవుతున్న పోలీసులు

హక్కులు తెలుసుకోండి

- వినియోగదారులకు అవగాహన కల్పించాలి
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వినియోగదారులు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ సూచించారు. బాపూజీ కళామందిర్‌లో ఆదివారం జరిగిన వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు నష్టం జరిగితే సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం గురించి సరైన అవగాహన లేనందున కొందరు వినియోగదారులు ఇప్పటికీ నష్టపోతున్నారని, ప్రజలందరికీ ఈ చట్టం అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేసిన మాస్టర్ ట్రైనర్ వెంకటాచలం రచించిన కరపత్రాన్ని జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు.

అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వివిధ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, పతకాలు, నగదు బహుమతులను జేసీ అందజేశారు. తొలుత వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు డ్రగ్ కంట్రోల్, తూనికలు కొలతలు, హెచ్‌పీ గ్యాస్, ఇతర శాఖలు ఏర్పాటుచేసిన ప్రదర్శన స్టాళ్లను జేసి పరిశీలించారు.

జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి మాట్లాడుతూ సాంకేతికత పెరగడంతో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, టెలీ మార్కెటింగ్ తదితరాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా సరఫరాల అధికారి డి.వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారులు ఎక్కడైనా మోసపోతే మండల కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సహాయ ఆహార భద్రతాధికారి రత్నం మాట్లాడుతూ కలుషిత ఆహారాలు ఏవిధంగా గుర్తించాలి వాటిని ఎలా నియంత్రించాలి తదితర కీలకమైన అంశాలు వివరించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నక్కా యుగంధర్, మాట్లాడుతూ మందులు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

క్రీడాకారులకు విశ్వవ్యాప్త గుర్తింపు

- ఒలింపిక్ అసోసియన్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సంఘీభావంగా 3కె రన్ ర్యాలీ




జెండా ఊపి 3కే రన్ ర్యాలీని జేసీ నవీన్‌తో కలిసి ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడాకారులకు విశ్వవ్యాప్త గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సంఘీభావంగా జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 3కె రన్ ర్యాలీని కృష్ణదాస్ లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో జాయింట్ కలెక్టర్ నవీన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల సత్తాను వెలికితీసేందుకు సీఎం వైఎస్ జగన్ అద్భుత అవకాశం కల్పించారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారు చేయడానికి ఈ పోటీలు వేదిక కానున్నాయన్నారు. జిల్లాలో రానున్న 50 రోజుల పాటు ఈ క్రీడలు పండుగ వాతావరణంలో జరుగనున్నాయని తెలిపారు.

దేశంలోనే తొలిసారిగా...

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ దేశంలో క్రీడల పోటీల విషయంలో ఎక్కడా జరగని విధంగా మన రాష్ట్రంలో జరగడం క్రీడల ప్రాధాన్యతను స్పష్టం చేస్తుందన్నారు. సచివాలయాల వారీగా కిట్లు పంపిణీ చేపట్టారని గుర్తుచేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ఐదు క్రీడాంశాల్లో ఈనెల 26 నుంచి జిల్లాలో మొదలు కానున్నాయన్నారు. సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఇలా మొత్తం ఐదు స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తున్నామని జేసీ నవీన్ వివరించారు. అంతకుముందు క్రీడల పోటీలకు సంఘీభావంగా ఏడురోడ్ల కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, డీఈఓ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఎస్‌డిఓ డాక్టర్ శ్రీధరరావు, కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్ సీపీ నేత ఎంవీ స్వరూప్, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, ఒలింపిక్ జిల్లా సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు, పీఈటీ సంఘ నేతలు ఎంవి.రమణ, బివి.రమణ, కె.మాధవరావు, వివిధ శాఖాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సేవలు C/O సచివాలయం



- 14 రకాల పనులు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పూర్తి
- ప్రజలకు అందుబాటులో ఎనర్జీ అసిస్టెంట్లు
- త్వరితగతిన పరిష్కారమవుతున్న విద్యుత్ సమస్యలు

కంచిలి: సచివాలయాల రాకతో పల్లెల్లో పనులు సులభమవుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సేవలు మరింత చేరువయ్యాయి. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లోనే విద్యుత్ సంబంధిత సేవలు దాదాపు అన్నింటినీ అందించేందుకు శ్రీకారం చుట్టింది. మీ–సేవా కేంద్రాల్లో పొందిన సేవలు ఇకపై వినియోగదారుల ఇంటికి చేరువలోనే లభించే ఏర్పాటు చేసింది. గ్రామాల్లో కరెంటు బిల్లులు కట్టడానికి సచివాలయాలకు వెళితే సరిపోతుంది. తాజాగా అమల్లోకి వచ్చిన ఈ సేవలతో జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.


ఎనర్జీ అసిస్టెంట్లకు బాధ్యతలు..

పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు అంతరాయాలు లేకుండా విద్యుత్ అందించడంలో ఎనర్జీ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. సచివాలయ వ్యవస్థలో భాగంగా జిల్లావ్యాప్తంగా 560 మంది ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్‌శాఖ ద్వారా నియమించారు. వీరికి అవసరమైన శిక్షణను విద్యుత్ శాఖ ద్వారా ఇచ్చారు. భవిష్యత్‌లో వీరికి లైన్‌మెన్, సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్ సూపర్‌వైజర్, ఫోర్‌మెన్‌గా పదోన్నతులు పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి ఎనర్జీ అసిస్టెంట్‌ను తను పనిచేస్తున్న సచివాలయం పరిధిలో అన్ని విద్యుత్ కనెక్షన్‌లకు బాధ్యుడిని చేశారు. సచివాలయం పరిధిలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా, మీటర్లు ఆగిపోయినా, కొత్తవి బిగించడం వంటి విధులతో పాటు మరే ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తినా వీరు చూసుకుంటారు. వారిస్థాయి కానప్పుడు పై అధికారులకు వెంటనే సమాచారం అందించడం ద్వారా సాంకేతిక నిపుణులు త్వరగా వచ్చేలా చూస్తారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి వలంటీర్ల ద్వారా గానీ, ప్రజలు నేరుగా గానీ గ్రామ సచివాలయానికి ఫిర్యాదు చేస్తే క్షణాల్లో సమస్యలను పరిష్కరిస్తారు.

సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన విద్యుత్ సేవలు

- గృహ, వాణిజ్య సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు.
- వ్యవసాయ సర్వీసు కనెక్షన్ల కోసం దరఖాస్తు.
- అదనపు లోడ్ దరఖాస్తు.
- కేటగిరీ మార్పు.
- సర్వీసు కనెక్షన్ పేరు మార్పు.
- మీటరు టెస్టింగ్‌కు సంబంధించిన అంశాలు.
- మీటరు కాలిపోవడంపై ఫిర్యాదు.
- బిల్లులకు సంబంధించిన సమస్యలు.
- ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఫిర్యాదులు.
- వోల్టేజీ హెచ్చుతగ్గులపై ఫిర్యాదులు.
- లైన్ షిఫ్టింగ్.
- పోల్ షిఫ్టింగ్.
- మీటరు ఆగిపోవడం, నెమ్మదిగా తిరగడంపై ఫిర్యాదులు.
- విద్యుత్ బిల్లులు చెల్లింపు.

సీఎం సూచనలతోనే..



సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలు పొందేందుకు ప్రజలకు అవకాశం కల్పించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సూచనలతో.. విద్యుత్‌శాఖ పరిధిలో అన్ని రకాల సేవలను సచివాలయాల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చాం. డిజిటలైజేషన్ నేపథ్యంలో ఆన్‌లైన్ పేమెంట్ యాప్స్(యూపీఐ)ల ద్వారా, డిస్కంల సొంత యాప్స్ ద్వారా చాలా మంది విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. కొందరు అందుబాటులో ఉన్న నగరాలు, పట్టణాల్లో ఎనీ టైమ్ పేమెంట్(ఏటీపీ) మెషీన్స్, విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో బిల్లులు కడుతున్నారు. గ్రామాల్లో నెలకోసారి దండోరా వేయించి సంస్థ ప్రతినిధి వెళ్లి బిల్లులు కట్టించుకుంటున్నారు. ఇకపై సచివాలయాల్లో కూడా కరెంటు బిల్లులు చెల్లించే సౌకర్యాన్ని కల్పిస్తున్నాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ, శ్రీకాకుళం

క్లుప్తంగా

'వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి'



మాట్లాడుతున్న కె.నాగలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అశిరినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ అనుబంధ వీఓఏల సంఘం జిల్లా సమావేశం డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో డచ్ బిల్డింగ్ వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెలుగు సంస్థలో పని చేస్తున్న వీఓఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు.

20 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్టు

కొత్తూరు: కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన సవలాపురపు బాలరాజు మోటారు సైకిల్‌పై 20 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఏఎం అహ్మద్ తెలిపారు. మెట్టూరు సెంటర్ వద్ద ఆదివారం అతడిని పట్టుకున్నామని, మోటారు సైకిల్ సీజ్ చేసి బాలరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

చీమలవలసలో కోతుల గుంపు



కోతుల దాడిలో గాయపడిన అంజలిని ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబసభ్యులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని చీమలవలస గ్రామంలో కోతులు స్వైర విహారం చేస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో వీధులు, ఇళ్లు, పొలాల్లో కోతులు గుంపులు, గుంపులుగా చేరి ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వీటి దాడిలో ఆదివారం బొడ్డేపల్లి అంజలి గాయపడ్డారు. ఈ సమస్య గురించి అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు



కుప్పిలిలో పండిస్తున్న అంతర పంట

ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల వంటి వర్షాధార ప్రాంతాల్లో అంతర పంటలకు రైతులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతర పంటల్లో భాగంగా ఒకో చోట పలు రకాల పంటలను వేయడం వల్ల ఒక పంట పోయినా మిగతా పంటలు పండటం వల్ల నష్టపోయే అవకాశం ఉండదని రైతులు అంటున్నారు. కొబ్బరి, ముల్లంగి, బెండ, మిరప, అరటి పంటలను ఒకే చోట వేసి పండిస్తున్నారు. దీని వల్ల తక్కువ భూమిలో తక్కువ పెట్టుబడితో పలు రకాల ఉత్పత్తులను పండించవచ్చని రైతులు అంటున్నారు.

తక్షణ ప్రవేశాలపై ఆశలు

- బీఆర్ఏయూలో 16 కోర్సుల్లో 605 సీట్లకు 254 ప్రవేశాలు
- ఖాళీ సీట్లు 351
- ఈ నెల 26 నుంచి 29 వరకు స్పాట్ అడ్మిషన్లు
- స్పాట్ అడ్మిషన్లకు పీజీ సెట్-2023 ర్యాంకు తప్పనిసరి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

కోర్సు	సీట్లు	నిండినవి	ఖాళీలు
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	33	00
ఎనలాటికల్ కెమిస్ట్రీ	22	22	00
బయోటెక్నాలజీ	33	30	03
మైక్రోబయాలజీ	22	21	01
మ్యాథ్స్	44	21	23
అప్లైడ్ మ్యాథ్స్	22	14	08
ఫిజిక్స్	44	16	28
ఎంజేఎంసీ	33	07	26
తెలుగు	44	11	33
ఎకనామిక్స్	44	13	31
ఎంఎల్ఐఎస్సీ	44	20	24
ఇంగ్లిష్	44	21	23
ఎంకాం	44	11	33
రూరల్ డెవలప్‌మెంట్	44	05	39
ఎంఈడీ	44	06	38
సోషల్ వర్కు	44	03	41

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 16 పీజీ కోర్సులకు రాష్ట్రం యూనిట్‌గా నిర్వహిస్తున్న ఏపీ పీజీ సెట్-2023 ద్వారా రెండు విడతలు ప్రవేశాలు కల్పించారు. ఈ కౌన్సెలింగ్‌లో సైతం చాలా కోర్సుల్లో సీట్లు మిగిలిపోయాయి. వర్సిటీలో మొత్తం 605 సీట్లు ఉండగా, 254 ప్రవేశాలు జరిగాయి. 351 సీట్లు మిగిలిపోయాయి. దీంతో స్పాట్ అడ్మిషన్ల పైనే వర్సిటీ ఆశలు పెట్టుకుంది. స్పాట్ అడ్మిషన్లు నిర్వహించుకునే వెసులుబాటు ఉన్నత విద్యా మండలి కల్పించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయాలు తక్షణ ప్రవేశాలు ఈ నెల 26 నుంచి 29వ తేదీ మధ్య నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సెట్‌తో సంబంధం లేకుండా ప్రవేశాలు కల్పించేవారు. ప్రస్తుతం పీజీ సెట్ ఉంటేనే తక్షణ ప్రవేశాల అడ్మిషన్ ఇస్తారు. సెట్ ర్యాంకు ఉన్న వారు అవకాశం సద్వినియోగం చేసుకుంటే పీజీ విద్య చదివేందుకు అవకాశం లభిస్తుంది. కొన్ని ఆర్ట్స్ కోర్సుల్లోనైతే కనీస ప్రవేశాలు లేవు. సోషల్ వర్క్‌లో మూడు, రూరల్ డెవలప్‌మెంట్‌లో ఐదు, ఎంఈడీలో ఐదు, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో ఏడు మాత్రమే ప్రవేశాలు జరిగాయి.

'స్పాట్' సద్వినియోగం చేసుకోండి



ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తాం. ఈ నెల 26 నుంచి 29వ తేదీ మధ్య దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్ బట్టి జాబితా తయారు చేసి, ప్రవేశాలు కల్పిస్తాం. స్పాట్ అడ్మిషన్లకు ఏపీ పీజీ సెట్-2023 ర్యాంకు తప్పని సరి. వీటికి ప్రభుత్వ రాయితీలు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వర్తించవు.

– డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అడ్మిషన్స్ కోఆర్డినేటర్

'వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తాం'



ఐక్యతను చాటుతున్న కళింగ కోమట్ల కార్పొరేషన్ డైరెక్టర్లు

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కళింగ కోమట్లకు సముచిత స్థానం లభించిందని ఆ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ఓ హోటల్‌లో ఆదివారం కళింగ కోమటి రాష్ట్ర కార్పొరేషన్ బోర్డు సమావేశం నిర్వహించారు. అనంతరం చైర్మన్ సూరిబాబు విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ బీసీ పక్షపాతిగా పేరొందారని అన్నారు. ఓబీసీ సాధనకు కూడా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జిల్లాలో కళింగ కోమట్ల సంఘానికి ఒక భవనం నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నామని, దీనికి అనుగుణంగా స్థలం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.

అలాగే డైరెక్టర్ పి.సాయిప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి నిర్ణయించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో పాటు బోర్డు డైరెక్టర్లు పాట్నూరు సాయి ప్రసాద్, దేవరశెట్టి కుసుమ కుమారి, సకలాభక్తుల ప్రసాదరావు, వారణాశి మునికేశ్వరరావు, కొత్తకోట సురేష్ కుమార్, మోనంగి ప్రమీళ, టంకాల పావని, బాలగంగాధర గుప్త తదితరులు పాల్గొన్నారు.

తప్పెటగుళ్లు కళాకారులకు సత్కారం

కాశీబుగ్గ: స్థానిక బంకేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ వారు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సలహా సమితి సభ్యులు బెస్త కామేశ్వరరావు మాట్లాడుతూ వారం వారం భజన, సామూహిక హారతి, నగర సంకీర్తన, సత్సంగం నిర్వహించాలని కోరారు. పలాస మండలం పరిధిలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో పూజ్య స్వామిజీ, రామానంద స్వామిజీ, పూజ్య శ్రీనివాసయోగి, బాలకృష్ణ స్వామి, మండల సంయోజక్ కొత్తపల్లి చిన్నాచారి, బూర్ల కోటేశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

గిరిప్రాంతాల్లో చలి పులి



సీది కూడలి వద్ద జాతీయ రోడ్డును కప్పేసిన పొగమంచు

పాతపట్నం: పాతపట్నంతో పాటు పరిసర గిరిజన ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. ఐదు రోజుల కిందట పాతపట్నంలో 18 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత ఉండగా ప్రస్తుతం 11 డిగ్రీలకు తగ్గింది. దీంతో రాత్రులే కాకుండా పగలు కూడా చలికి వణుకుతున్నారు. రాత్రి వేళల్లో మంచు విపరీతంగా కురుస్తుండడంతో దారి కనిపించడం లేదని వాహన చోదకులు తెలిపారు. శ్రీకాకుళం, సారవకోట నుంచి వచ్చేటపుప్పుడు మార్గమంతా మంచుతో కప్పేసి ఉందని డ్రైవర్లు అంటున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



సూర్యనమస్కారాల పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మార్గశిర మాస ఆదివారం భక్తజనం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం వైకుంఠ ఏకాదశి నుంచి ఆదివారం సాయంత్రం వరకు గర్భాలయంలో స్వామి వారి మూలవిరాట్టు స్వర్ణాలంకరణలో దర్శనమివ్వడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వి విధ దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,22,100, విరాళాల రూపంలో రూ.90,384, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.10 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లుగా ఈఓ తెలిపారు.

జాషువాపై చారిత్రక దృష్టితో పరిశోధన



డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్‌ను సత్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: జాషువాపై చారిత్రక దృష్టితో పరిశోధన జరగాలని శ్రీకాకుళం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి జాషువా కవితా వైభవంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాషువా గబ్బిలం-ఆంధ్ర చారిత్రక వైభవం అనే విషయంపై మాట్లాడుతూ తనను తాను విశ్వనరుడిగా ప్రకటించుకున్నా, కొందరు మాత్రం సంఘసంస్కరణకు, దళితవాదానికి, దేశభక్తికి మాత్రమే పరిమితం చేశారన్నారు. నేతాజీ-బాపూజీ, గబ్బిలం-క్రీస్తు ఇలా విభిన్న తత్వాలు కలగలిపిన రచనలు ఆయనను విశ్వనరునిగా చూపిస్తాయన్నారు. గబ్బిలం రచనలో హంపి, కవిత్రయం, కొండవీటి రాజులు తదితర చారిత్రక అంశాలు సోదాహరణంగా చూపించారని కొనియాడారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు స్వాగతం పలకగా, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. అనంతరం సమాఖ్య గౌరవ సలహాదారు బీహెచ్‌కే.బాబూజీ సమ్మానకర్తగా వ్యవహరించారు. మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థులు కోట విజయకుమార్, పెంకి సాయితేజలు కవితాగానం చేశారు. కార్యక్రమంలో మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల అధ్యక్షుడు డాక్టర్ జి.జనార్దనాయుడు, సభ్యులు భోగరాజు సూర్యలక్ష్మి, బాబూరావు, రాఘవరావు, వారణాసి మూర్తి, గురునాథరావు, సర్వేశ్వరరావు, సోమేశ్వరరావు, హరిచందన్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

తగలబెట్టడం తప్పు



పొలంలో గడ్డిని తగలబెడుతున్న రైతులు

- పంటల వ్యర్థాల కాల్చివేత తగదు
- యాంత్రీకరణ నూర్పిడితో 50శాతం ఖర్చు ఆదా
- కాల్చివేత పొలానికి నష్టమంటున్న వ్యవసాయాధికారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో సుమారు 1.43 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. అక్కడక్కడా పొలాల్లో మిగిలిపోయిన గడ్డిని, మోడులను తగులబెడుతున్నారు. ఇది పర్యావరణానికి చేటు చేయడమే కాకుండా భూసారం కూడా తగ్గించేస్తుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా వరి పొలాల్లో పంటను కోసి, ఓదెలుగా పేర్చి, కుప్పలు వేసి, నూర్పిడి చేసి ధాన్యాన్ని సేకరిస్తుంటారు. ఇదంతా శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. ఈ క్రమంలో రైతులు యంత్రాలతో నూర్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నేలకొరిగి రైతన్నలు నష్టపోయారు. సాధారణ పద్ధతిలో కోతలు కోసేందుకు ఎకరాకు రూ.7 వేలు, ఓదెలు పెట్టిన కుప్పలు వేసేందుకు రూ. వెయ్యి, నూర్పిడి చేసేందుకు రూ.3వేలు ఖర్చు చేయాల్సి వచ్చేది. యంత్రాలతో నూర్పిడి చేయటం వల్ల కేవలం రూ.4వేలు నుంచి రూ.5 వేలు ఖర్చుతో ధాన్యం ఇంటికి చేరే పరిస్థితి వచ్చింది. దీంతో రైతులు యంత్రాలతో నూర్పిళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

గడ్డి కాల్చివేతతో అనర్థాలు

సాధారణ పద్ధతిలో కోత కోసి, నూర్పిడి చేస్తే, పశుగ్రాసం మిగులుతుంది. ఇది పశువులకు దాణాగా ఉపయోగపడుతుంది. ఎండు గడ్డిని మోపులుగా వ్యర్థాలను దహనం చేస్తున్నారు. గడ్డి వాములుగా పేర్చుకుని అవసరానికి తగ్గట్టుగా తీసుకెళ్లి పశువులకు పెడుతుంటారు. అలా కాకుండా యంత్రంతో నూర్పిస్తే, గడ్డి ముక్కలవుతుంది. పశువులు తినడానికి పనికి రాకుండా పోతోంది. హార్వెస్టర్స్‌తో నూర్పిడి సందర్భంలో గడ్డి ముక్కలైపోయి పొలంలోనే వాహనం వెంట పడిపోతూ ఉంటుంది. ఇలా మిగిలిపోయిన గడ్డి ఎందుకూ పనికి రాకపోవడంతో రైతులు పొలాల్లోనే తగులబెడుతున్నారు. దీనివల్ల పర్యావరణంలో హానికరమైన వాయువులు కలిసి గాలి కాలుష్యం పెరిగిపోతుంది.

పొలంలో గడ్డిని దున్నేస్తే లాభాలెన్నో

పొలాల్లో మిగిలిపోయిన పంట వ్యర్థాలను కలియదున్నడమే మేలు. మొక్కలు భూమిలోని పోషకాలను తీసుకుంటాయి. అవి మొక్కల్లోనే మిగిలిపోయి ఉంటాయి. వీటిని కలియదున్నడంతో తిరిగి పోషకాలు లభించి, భూమి సారవంతంగా తయారవుతుంది. అలాకాకుండా తగులబెట్టడం వల్ల పోషకాలన్నీ నశిస్తాయి. అనంతరం వేసే పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. యంత్రాలతో నూర్పిడి చేసినా మిగిలిపోయిన గడ్డిని మోపులుగా కట్టేయంత్రాలు అందుబాటులో ఉన్నాయని రైతులు గమనించాలి. తగల బెట్టటం వల్ల పొలంలోని సూక్ష్మపోషకాలు చనిపోతాయి. రైతులు యంత్రాలతో కోసిన గడ్డిని పశువులకు మేపుకోవచ్చు.

అవగాహన లోపంతోనే..



యంత్రాలతో వరి కోసిన గడ్డిని తగులబెట్టకుండా బేలింగ్‌గా నిల్వ చేసుకుని పశువుల మేతకు చక్కగా ఉపయోగించవచ్చు. ఆర్గానిక్ పంటలకు ఉపయోగపడుతుంది. దీని వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు. తగలబెట్టటం వల్ల భూమి, గాలి కాలుష్యమైపోతోంది. భవిష్యత్‌లో వేసే పంటల్లో దిగుబడులు తగ్గపోతోంది. అపరాలు వేసేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయి.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం.

మద్యం మానలేక కారు డ్రైవర్ ఆత్మహత్య



ఉరి వేసుకున్న వేణుగోపాలరావు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని బలిజేపల్లివారి వీధిలో ఓ కారు డ్రైవర్ మద్యం మానలేక, భార్య వేరుగా ఉంటుందన్న మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కె.లక్ష్మి ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాలోని జైపూర్ సమీపంలో శివాజీపాలెంకు చెందిన కొల్లి వేణుగోపాలరావు(52) బలిజేపల్లివారి వీధిలో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వేణుగోపాలరావుకు విజయనగరానికి చెందిన వాణితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే మద్యపానం సమస్య వల్ల ఈ దంపతులు విడిపోయారు. ఆ తర్వాత కుమారి అనే మహిళను ఆయన వివాహం చేసుకున్నారు. ఇంట్లో చెప్పకుండా ఈ పెళ్లి చేసుకోవడంతో అప్పట్లోనే కుటుంబాన్ని విడిచిపెట్టి ఇక్కడ సెటిల్ అయ్యారు. వీరికి సంతానం లేరు. మద్యం అలవాటు మానలేకపోవడంతో కుటుంబంలో తరచూ గొడవలయ్యేవి. వేణుగోపాలరావు తల్లి అప్పుడప్పుడూ వచ్చి పరిస్థితులు చూసేవారు. వేణుగోపాలరావులో ఎంతకూ మార్పు రాకపోవడంతో ఆయన భార్య కుమారి చేపలవీధిలో వేరుగా ఇల్లు అద్దెకు తీసుకుని ఉండేవారు. ఈ నెల 23న కారు ఓనర్ ఫోన్ చేస్తే వేణుగోపాలరావు లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆ పక్కింటి వాళ్లు కుమారికి సమాచారం అందించగా.. ఆమె శనివారం రాత్రి వచ్చి చూసే సరికి ఇంటిలో ఆయన ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో ఆమె కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు ఆదివారం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మి పేర్కొన్నారు.

తూర్పుకాపుల ప్రగతే లక్ష్యం




ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపికైన యువకులను సన్మానిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో తూర్పుకాపుల ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ సామాజిక వర్గ ప్రతినిధులు తెలిపారు. ఎచ్చెర్లలోని పాత జాతీయ రహదారికి ఆనుకుని ఆదివారం శ్రీకాకుళం తూర్పు కాపుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాసమ్మేళనం నిర్వహించి, వన సమారాధన చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ భవనంపై చర్చించి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా తమ సామాజిక వర్గం నుంచి ఎస్‌ఐ పోస్టులకు ఎంపికైన యువకులు కలిశెట్టి రాంబాబు, రవి, వెల్లె బాలాజీ, బాలి కూర్మినాయుడులను సన్మానించారు. అలాగే సురంగి మోహనరావు, వండాన మురళి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లను కూడా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పు కాపులు అన్ని రంగాల్లో ఎదిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, నాయకులు డోల జగన్, కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, విశ్రాంత ఆర్డీవో రెడ్డి గున్నయ్య, శ్రీకాకుళం నాగర పాలక సంస్థ ఈఈ పొగిరి సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళింగుల ఆత్మీయ కలయిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కాళింగుల ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ ఆత్మీయ కలయికే నిదర్శనమని జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు అన్నారు. నిరుపేదల కాళింగులను ఉన్నత స్థానాల్లో ఉన్నవారంతా ఆదుకోవాలని, అప్పుడే తమ జాతి శతశాతం అభివృద్ధి చెందుతుందన్నారు. శ్రీకాకుళం నగరంలో కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.సూర్యం ఆధ్వర్యంలో ఆదివారం కళింగ భవన్ వద్ద ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కళింగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళింగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూన రవి కుమార్, డాక్టర్ ధానేటి శ్రీధర్, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాళింగ డైరీ ఆవిష్కరిస్తున్న జస్టిస్ యతిరాజులు, నాయకులు